సాక్షి వరంగల్

శనివారం । 7 । డిసెంబర్ । 2024



గూడ్స్ రైలు బోగిలో పొగలు

రామగుండం నుంచి సికింద్రాబాద్ వైపు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు బోగి నుంచి పొగలు వచ్చిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. - 8లో▸



హైటెక్ హంగులు

అమృత్‌భారత్ పథకంలో భాగంగా కాజీపేట జంక్షన్‌ను కేంద్రం నిధులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైటెక్ హంగులతో అత్యాధునీకరిస్తున్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31⁰/21⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సీఎం కప్ అబ్జర్వర్లుగా డీవైఎస్‌ఓ కోచ్‌లు



వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్స్ కప్–2024 కోసం అబ్జర్వర్లుగా జిల్లాకు చెందిన కోచ్‌లను నియమించినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి టీవీఎల్.సత్యవాణి తెలిపారు. కాశిబుగ్గలోని ఓసిటీ స్టేడియంలో డీవైఎస్‌ఓ కోచ్‌లు, మినిస్టీరియల్ స్టాఫ్‌తో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న మండలస్థాయి సీఎం కప్ పోటీలకు అబ్జర్వర్లుగా కోచ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. సీఎం కప్ పోటీలు పండగ వాతావరణంలో నిర్వహించాలని, ఆయా క్రీడల్లో ఉన్న నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో డీవైఎస్‌ఓ ఖోఖో, క్రికెట్, జూడో కోచ్‌లు అనిల్‌కుమార్, సుమన్, లింగమూర్తి, శ్రీకుమార్, మినిస్టీరియల్ సిబ్బంది మౌనిక, అహ్మద్ పాల్గొన్నారు.

అశోక్‌కు డాక్టరేట్



గీసుకొండ: మండలంలోని వంచనగిరి ప్రభుత్వ మోడల్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న దండి అశోక్‌కు ఉస్మానియా యూనివర్సిటీ గురువారం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'నరేటివ్స్ ఆఫ్ రెసిస్టెన్స్: ఎ స్టడీ ఆఫ్ ఐడియాలజీ అండ్ సోషల్ క్రిటిసిజం ఇన్ ద సెలెక్ట్ షార్ట్ స్టోరీస్ ఆఫ్ గోగు శ్యామల అండ్ జూపాక సుభద్ర' అంశంపై చేసిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ బి.అశోక్ పర్యవేక్షణలో పరిశోధన చేసిన అశోక్‌ను ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం, మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ బయ్యా సునీత అభినందించారు.

చేనేత కళాకారుల ర్యాలీ

వరంగల్: ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల్లో భాగంగా వరంగల్ చేనేత, జౌళి శాఖ, గోల్కొండ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేనేత, హస్త కళాకారులతో శుక్రవారం హనుమకొండలో విజయోత్సవ ర్యాలీ, సభ నిర్వహించారు. గోల్కొండ హస్తకళల సహాయ సంచాలకురాలు దివ్యారావు, షోరూం ఇన్‌చార్జ్ మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఇస్తున్న స్పెషల్ డిస్కౌంట్‌ను వినియోగించుకోవాలని కోరారు. చేనేత రంగం కోసం ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను వివరించారు. చేనేత, జౌళి శాఖ వరంగల్ సహాయ సంచాలకులు రాఘవరావు ప్రగతి నివేదికను వివరించారు. అనంతరం నిర్వహించిన పలు పోటీల విజేతలను సన్మానించారు.

మోటూరి రవిపై కేసులు ఉపసంహరించాలి



నర్సంపేట రూరల్: న్యాయవాది మోటూరి రవిని పలు కేసుల్లో ఇరికించి, కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్న నర్సంపేట పోలీసుల నిరంకుశత్వాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి, సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై కొంతకాలంగా పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూనే వింత వైఖరిని ప్రదర్శిస్తున్న పోలీసులు తమ తీరును మార్చుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాది మోటూరి రవిపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోకుంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వారు హెచ్చరించారు.

చెట్టు కొమ్మ తగిలి వ్యక్తి మృతి

దుగ్గొండి: చెట్టు కోస్తుండగా ప్రమాదవశాత్తు కొమ్మ తాకి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ముద్దునూరులో జరిగింది. గ్రామానికి చెందిన కన్నం జంపయ్య (53) మిషన్ సాయంతో చెట్లు కోయడానికి కూలి పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన బండి సారయ్య చింత చెట్టు కోయడానికి వెళ్లాడు. చింత చెట్టు ఎక్కి కొమ్మలు కోస్తుండగా ఓ కొమ్మ విరిగి జంపయ్య ఛాతికి బలంగా తాకింది. దీంతో తీవ్రంగా గాయపడిన జంపయ్యను స్థానికులు ఆస్పత్రికి తరలించే క్రమంలో అదేరోజు సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

డిసెంబర్ కోటా డిలే!

- చౌకధరల దుకాణాలకు చేరని బియ్యం
- నిల్వలు లేవని చేతులెత్తేసిన గోదాం ఇన్‌చార్జ్‌లు
- స్టేజ్–1 కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే సమస్య
- షాపుల వద్ద కార్డుదారుల పడిగాపులు
- పంపిణీకి మిగిలిన గడువు ఇంకా 9 రోజులే..
- కలెక్టర్ చొరవ తీసుకోవాలని రేషన్ డీలర్ల విజ్ఞప్తి



బియ్యం కోసం వరంగల్ కాశిబుగ్గలోని రేషన్ షాపునకు వచ్చిన లబ్ధిదారులు

ఖిలా వరంగల్: ఆహారభద్రత కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన డిసెంబర్ నెల కోటా బియ్యం చౌకధరల దుకాణాలకు ఇంకా చేరుకోలేదు. గోదాముల్లో బియ్యం నిల్వలు లేక పంపిణీ ఆలస్యం అవుతోంది. రేషన్ డీలర్లు స్టాక్‌పాయింట్ గోదాముల వద్దకు చేరుకుని బియ్యం రాక కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని వరంగల్ ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి మూడు మండలాలు, వర్ధన్నపేట ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి నాలుగు మండలాలు, నర్సంపేట ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి ఆరు మండలాలకు చెందిన చౌకధరల దుకాణాలకు బియ్యం చేరుతాయి. ఈ పాయింట్లలో ఎక్కడ కూడా బియ్యం నిల్వలు లేవు. దీంతో జిల్లాలో దొడ్డు బియ్యం కొరత ఏర్పడింది. అధికారులు దీనిపై సకాలంలో స్పందించి ఆర్వోలు జారీ చేశారు. ఈనెల ఒకటి నుంచి జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని గోదాముల నుంచి వరంగల్ జిల్లాకు రవాణా చేయాలని స్టేజ్–1 కాంట్రాక్టర్‌కు ఉత్తర్వులు అందాయి. కాంట్రాక్టర్ లారీలు సమకూర్చకపోవడంతో గోదాములకు బియ్యం లోడ్‌లు రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంపిణీ గడువు ఆరు రోజులు ముగిసినా కనీసం 45 శాతం షాపులకు కూడా బియ్యం పంపించలేక ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌లు చేతులెత్తేసినట్లు తెలిసింది.

జిల్లాలో 507 చౌకధరల దుకాణాలు..

జిల్లాలో మొత్తం 507 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. 2,66,662 ఆహార భద్రతకార్డులకు 4,724,934 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రతి నెల పంపిణీ చేయాల్సి ఉంటుంది. వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేట ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాముల ద్వారా ఒక్కో చౌక దుకాణానికి కేటాయించిన నెల కోటా బియ్యం లారీల్లో సరఫరా చేస్తారు. ఒక్క వరంగల్ ఎంఎల్‌ఎస్ పాయింట్ పరిధిలోనే వరంగల్ మండలంలో 85, ఖిలావరంగల్ మండలంలో 72, గీసుకొండ మండలంలో 35 దుకాణాలు ఉన్నాయి. దొడ్డు బియ్యం కొరత కారణంగా శుక్రవారం వరకు మూడు మండలాల పరిధిలోని 50 శాతం దుకాణాలకు బియ్యం చేరుకోకపోవడం గమనార్హం. పంపిణీకి ఇంకా 9 రోజుల గడువు మాత్రమే ఉండడం, రేషన్‌షాపులకు బియ్యం చేరకపోవడంతో డీలర్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. దీంతో జిల్లాలోని డీలర్లు గోదాము ఇన్‌చార్జ్‌లపై ఒత్తిడి పెంచుతున్నారు.

అసలు సమస్య ఇక్కడే..

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇతర జిల్లాల నుంచి లారీల్లో బియ్యం సకాలంలో ఎంఎల్‌ఎస్ పాయింట్లకు చేరుకోలేకపోతున్నాయి. కాంట్రాక్టర్ లారీలు లోడుకు పెట్టకపోవడంతోనే ఈ సమస్య ఎదురవుతోందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఆరు రోజులుగా ఎంఎల్‌ఎస్ పాయింట్లకు ఒకటి రెండు లారీలు పంపిస్తే రెండు, మూడు షాపులకు మాత్రమే బియ్యం వస్తున్నాయి. డీలర్లకు ఏం సమాధానం చెప్పాలో తెలియక గోదాం ఇన్‌చార్జ్‌లు తలలు పట్టుకుంటున్నారు. కలెక్టర్, డీఎస్‌ఓ, డీఎం స్పందించి స్టేజ్–1 కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రేషన్ షాపులకు బియ్యం పంపిణీ చేయాలని డీలర్లు కోరుతున్నారు.

10 వరకు బియ్యం సరఫరా చేస్తాం..

గోదాముల్లో దొడ్డు బియ్యం నిల్వలు లేక ఇతర జిల్లాల నుంచి తెప్పించి చౌక ధరల దుకాణాలకు పంపిస్తున్నాం. స్టేజ్–1 కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతాం. డీలర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈనెల 10వ తేదీ వరకు అన్ని దుకాణాలకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- సంధ్యారాణి, సివిల్ సప్లయీస్ డీఎం

మార్షల్ ఆర్ట్స్‌తో స్వీయ రక్షణ

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ పాఠశాలలో కరాటే శిక్షణ ప్రారంభం



కరాటే శిక్షణను తిలకిస్తున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో కలెక్టర్ సత్య శారద



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న మంత్రి సురేఖ, కలెక్టరర్ సత్య శారద

ఖిలా వరంగల్: చట్టాలు ఎన్ని తెస్తున్నా, షీటీంలను నియమిస్తున్నా బాలికలు, యువతులు, మహిళలపై దాడులు అగడం లేదని, ఇలాంటి పరిస్థితుల ఉంచి బాలికలు తమను తాము రక్షించుకునేందుకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ఖిలా వరంగల్ ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షన్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన కరాటే శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ డాక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు సువర్ణ, బైరబోయిన ఉమతో కలిసి మంత్రి కొండా సురేఖ ప్రారంభించి మాట్లాడారు. బాలికలపై జరుగుతున్న అకృత్యాలు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలకు విద్యార్థి దశ నుంచే ఆత్మరక్షణ విద్యలు నేర్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ ఇప్పించేందుకు కలెక్టర్ కార్యాచరణ రూపొందిస్తున్నారని మంత్రి తెలిపారు. అదేవిధంగా 38వ డివిజన్‌లో రూ.1.23కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు రకాల అభివృద్ధి పనులకు మంత్రి సురేఖ శంకుస్థాపన చేశారు. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, ఆంజేయస్వామి గుడి నిర్మాణాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పడమరకోట జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్ సత్య శారదతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, టీపీసీసీ మెంబర్ మీసాల ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ దామోదర్, గజ్జెల శ్యాం, సాగర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్నం భోజనం అందించాలని, నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఇతర వంట సరుకుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ సత్య శారద హెచ్చరించారు. ఈ మేరకు ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మహిళలు తయారు చేస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్‌తో కలిసి ఆమె పరిశీలించారు.

రూ. 2.31 కోట్లు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఏడాదిలో పట్టుబడిన రేషన్ బియ్యం విలువ

- 11 నెలల్లో 1,277 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం
- రైస్‌మిల్లులు, కోళ్ల పరిశ్రమలకు తరలింపు
- నిఘా కన్నుగప్పి దారి మళ్లుతున్న వేలాది క్వింటాళ్లు
- అడపాదడపా తనిఖీలు, కేసుల నమోదుతో సరిపెడుతున్న పోలీసులు



హసన్‌పర్తిలో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్ పరిధిలో రేషన్‌బియ్యం పక్కదారి పట్టి సరిహద్దులు దాటుతోంది. పక్క రాష్ట్రాలు, కోళ్ల ఫామ్‌లు, రైసు మిల్లులకు తరలుతోంది. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా, అందరికీ తెలిసినా సివిల్ సప్లయీస్, పోలీస్ అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దళారులు తక్కువ ధరకు సేకరించి ఎక్కువ ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. సిండికేట్‌గా ఏర్పడి ఒకరి ఏరియాలోకి మరొకరు తలదూర్చకుండా ఒప్పందాలు కుదుర్చుకొని వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్‌వరకు కమిషనరేట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్, పోలీసులు తనిఖీలు చేసి 1,277 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కానీ నిఘా కళ్లు గప్పి వేలాది క్వింటాళ్లు దారి మళ్లిస్తున్నట్లు తెలుస్తోంది.

మామూళ్ల మత్తులో పోలీసులు..

పీడీఎస్ బియ్యం దందా ఏ స్థాయిలో జరుగుతోంది? ఎంత మొత్తంలో పక్కదారి పడుతున్నాయి? అందులో ఎవరి పాత్ర ఎంత అనే విషయాలు చాలావరకు పోలీసుల తెలిసే జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కమిషనరేట్ సరిహద్దు పోలీస్ స్టేషన్లలో ఈ దందా జోరుగా కొనసాగుతోంది. బియ్యం దళారులు పోలీస్ అధికారులకు పెద్ద మొత్తంలో డబ్బులను ఆశ చూపి తమ దందాను విస్తరించుకుంటూ పోతున్నారు. బియ్యం అక్రమ రవాణా సమాచారం జిల్లా కేంద్రంలో ఉన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చేరుతుంది కానీ స్థానిక పోలీస్‌లకు అందడం లేదు. వీరికి ప్రతినెలా బియ్యం మామూళ్లు జీతాల కంటే ముందుగా అందుతుండడమే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేయూ, హసన్‌పర్తి పోలీస్ స్టేషన్లలో ఓ అక్రమార్కుడు బియ్యం దందాలో 'కోటి'కి పరుగులు పెట్టి పోలీసులకు తలలో నాలుకలాగా మారినట్లు తెలిసింది. పోలీసులు చేసుకునే పార్టీలకు సైతం అన్ని తానే సమకుర్చడం గమనార్హం. కమలాపూర్, ఎల్కతుర్తి, మిల్స్‌కాలనీ, వర్ధన్నపేట, శాయంపేట, పరకాల, రాయపర్తి, మామునూరు, ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దందా ఎక్కువగా జరుగుతున్నట్లు సమాచారం.

తరలింపు ఇలా..

డీలర్లు, కార్డుదారుల నుంచి బియ్యం వ్యాపారులు ప్రతినెలా 5 నుంచి 15వ తేదీ వరకు బియ్యం సేకరిస్తారు. వీరికి కిలోకు రూ.7 నుంచి రూ.8 వరకు చెల్లిస్తారు. సేకరించిన బియ్యాన్ని ఒకచోట డంప్ చేస్తారు. ఆ తర్వాత బియ్యం తరలింపు పాయింట్‌కు వెళ్లే మార్గంలో క్లియరెన్స్ (పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులతో ముందుగా మాట్లాడుకుని) వచ్చాక డీసీఎంలు, లారీల్లో లోడ్ చేసి తరలిస్తున్నారు. ఇక చుట్టుపక్కల రైస్‌మిల్లులు, పౌల్ట్రీఫామ్‌లకు అయితే ట్రాలీ ఆటోల్లో తీసుకెళ్తారు. ఇక్కడ కిలోకు రూ.15 నుంచి రూ.20 మధ్య విక్రయిస్తారు.

ఇటీవల పట్టుబడిన బియ్యం ఘటనల్లో కొన్ని..

- ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 2న రూ.28,600 విలువ గల 11 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. జేఎస్‌ఎం పౌల్ట్రీఫామ్‌లో అక్రమంగా నిల్వ చేసిన ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని యజమాని తక్కళ్లపల్లి కిషన్‌రావును అదుపులోకి తీసుకున్నారు.
- గత నెల 23న పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చరణ్‌తేజ్ పౌల్ట్రీఫామ్‌లో రూ.31,200 విలువ గల 12 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి యజమాని రాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అదే రోజు శ్రీ రాజారాజేశ్వర పౌల్ట్రీఫామ్‌లో 25 క్వింటాళ్ల స్వాధీనం చేసుకొని యజమాని బొల్లం జనార్దన్‌రెడ్డిని అరెస్టు చేశారు.
- గత నెల 13వ తేదీన హసన్‌పర్తి మండల కేంద్రంలోని చిన్నంగి చెరువు సమీపంలో పోలీసుల తనిఖీలో రూ.4.48 లక్షల విలువైన రేషన్ బియ్యం పట్టుబడింది. డ్రైవర్ రవివర్మను విచారించగా జమ్మికుంట నుంచి వస్తున్నట్లు చెప్పాడు.
- గత నెల 12న మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 5 క్వింటాళ్లు, కమలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 27 క్వింటాళ్లు, మరోచోట 42 క్వింటాళ్లు పట్టుకున్నారు.
- గత నెల 11న గీసుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతి రైస్ మిల్లులో 24 క్వింటాళ్లు, నెక్కొండ మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో డంప్ చేసిన 110.5 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం



పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమమార్గంలో సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు ఉంటాయి. నిఘాను పటిష్టం చేశాం. ప్రజలు బాధ్యతగా అసాంఘిక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చి సహకరించాలి.

-అంబర్ కిషోర్ ఝా, వరంగల్ సీపీ

10 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 10 మంది విద్యార్థులు స్క్వాడ్లకు పట్టుబడినట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలాదేవి తెలిపారు.

రైతుల నిరీక్షణకు తెర

- కేఎంటీపీకి భూములిచ్చినందుకు ఇళ్ల స్థలాలు
- 863 మందికి డ్రా పద్ధతిలో కేటాయింపు
- 54.11 ఎకరాల్లో మౌలిక సదుపాయాల కల్పన
- మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నేడు పంపిణీ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కేఎంటీపీలో మంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుకొండ: జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ) ఏర్పాటు కోసం భూములు ఇచ్చిన రైతుల నిరీక్షణకు తెరపడనుంది. కేఎంటీపీకి భూములు ఇచ్చిన రైతులకు శనివారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డ్రా పద్ధతిలో ఇళ్ల స్థలాలను కేటాయించనున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి భూములు ఇచ్చిన రైతులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన విషయం తెలిసిందే. పార్కు కోసం సుమారు 1300 ఎకరాల భూములు సేకరించారు. అందులో భూములు ఇచ్చిన 863 మంది రైతులకు తొలి విడత ఇంటి స్థలాలు ఇవ్వనున్నారు. వీరందరికీ ఇళ్ల స్థలాల కోసం 54.11 ఎకరాల భూమి కేటాయించి అందులో రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. గీసుకొండ మండలం శాయంపేట, రాయనికుంట, ఊకల్, వంచనగిరికి చెందిన 508, సంగెం మండలం కుంటపల్లి, కృష్ణానగర్, కాట్రపల్లి, వెంకటాపురానికి చెందిన 355 మంది రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయించే కార్యక్రమాన్ని చేపట్టారు. కేఎంటీపీ పైలాన్ వద్ద స్థలాల కేటాయింపు కోసం సభా వేదికను ఏర్పాటు చేశారు. కాగా, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కేటాయించే ఇళ్ల స్థలాల ప్రాంతాన్ని టౌన్‌షిప్ తరహాలో అభివృద్ధి చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాల, పశువైద్యశాల మంజూరు చేసింది. మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు జిల్లా మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్య శారదతోపాటు టీజీఐఐసీ అధికారులు పాల్గొననున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం కేఎంటీపీలో సభావేదిక, ఇళ్ల స్థలాల పంపిణీ ఏర్పాట్లను రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు.

బ్రాహ్మణ భవనాన్ని ప్రారంభించనున్న మంత్రి

మంత్రి శ్రీధర్‌బాబు గొర్రెకుంట రెవెన్యూ పరిధిలోని హరిహర ఎస్టేట్‌లో రూ.44 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించిన బ్రాహ్మణ భవన్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం కేఎంటీకి వెళ్లి అక్కడ నెలకొల్పిన గణేశ, యంగ్‌వన్, కైటెక్స్ కంపెనీల పనులను పరిశీలిస్తారు. పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద ఇళ్ల స్థలాలను డ్రా తీసి రైతులకు కేటాయించనున్నారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తాజాజీ వాకాడే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

చెన్నారావుపేటలో జీవాల చోరీ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



దొంగలు వదిలేసిన మేకను చూపుతున్న గొర్రెల కాపరి కుమారస్వామి

చెన్నారావుపేట: బయట కట్టేసిన జీవాలను దొంగలను ఎత్తుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఈర్య తండాకు చెందిన అజ్మీరా సమ్ములు తనకున్న మేక, గొర్రె పోతును ఇంటి ముందు కట్టేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు కారులో గురువారం రాత్రి ఎత్తుకెళ్లారు. సుమారు వాటి విలువ రూ.30 వేలకు పైగా ఉంటుంది. అదేవిధంగా దొంగలు కట్టయ్యపల్లిలో బొంత సురేశ్‌కు చెందిన మంద వద్దకు రాత్రి 3 గంటల సమయంలో వచ్చారు. రోడ్డు పక్కన కారు ఆపి గొర్రెల మంద చుట్టు ఉన్న కంచెను ఓ పక్క తొలగించి కట్టేసి ఉన్న మేక పోతును విప్పారు. అది అరవడంతో పక్కనే పాకలో పడుకున్న గొర్రెల కాపరి బొంత కుమారస్వామి లేచి దొంగలు, దొంగలు అని అరిచాడు. తనపై దాడిచేసి మేకను వదిలేసి వెళ్లారు, వారు వచ్చిన కారులో రెండు జీవాలు అరిచాయని కుమారస్వామి తెలిపాడు. ఈ మేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రామస్థాయిలో కాంగ్రెస్ అరాచకాలు

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: నర్సంపేట నియోజకవర్గంలో పోలీస్ వ్యవస్థ మితిమీరి పోతోందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది పాలనలో అన్ని శాఖల పనితీరు గాడితప్పిందని అన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉంటే తప్పుడు కేసులు పెడుతున్నారని, హైదరాబాద్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పించే స్వేచ్ఛ లేకుండా పోయిందని మండిపడ్డారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ అరాచకాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. నర్సంపేట పోలీసులపై సీపీకి ఫిర్యాదు చేయగా విచారణ చేస్తామని చెప్పారని తెలిపారు. పట్టణంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపితే కేసులు పెట్టి, అర్ధరాత్రి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చి విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. ఏడేళ్ల శిక్షకులోబడి ఉంటే స్టేషన్ బెయిల్ ఇవ్వాలని కానీ రిమాండ్‌కు ఎలా పంపారని ప్రశ్నించారు. బార్ అసోసియేషన్ కూడా ఈ సంఘటన ఖండించిందని, న్యాయవాదులు విధుల బహిష్కరణ చేశారన్నారు. ఏడాదిలో నర్సంపేటకు ఏం వచ్చిందో త్వరలో ప్రజలకు తెలియజేస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణగౌడ్, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, నాగిశెట్టి ప్రసాద్, గోనె యువరాజు పాల్గొన్నారు.

సాహిత్య సభలను విజయవంతం చేయండి

- తెరసం అధ్యక్ష, కార్యదర్శులు పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్లా మహేందర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివాసరావు తదితరులు

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ రచయితల సంఘం పదేళ్ల సాహితీ సభలను విజయవంతం చేయాలని తెరసం అధ్యక్ష, కార్యదర్శులు పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్లా మహేందర్ కోరారు. శుక్రవారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ప్రముఖ కవి వీఆర్ విద్యార్థి గృహంలో సభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 8న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే సభలో ప్రముఖ కవులు, రచయితలు పాల్గొని ప్రసంగిస్తారని, వరంగల్ కవులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, వీఆర్ విద్యార్థి, శనిగరం రాజమోహన్, అస్నాల శ్రీనివాస్, రత్నమాల, అరుణకీర్తిపతాక తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు వేటగాళ్ల అరెస్ట్


అరెస్టు చూపిస్తున్న ఫారెస్ట్ అధికారులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో ముగ్గురు వేటగాళ్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ నరేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఫారెస్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు కమలాపూర్ గ్రామంలో ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకుని విచారించగా మొత్తం నలుగురు వ్యక్తులు కలిసి దుప్పిని వేటాడి మాంసం విక్రయించేవారని నేరం ఒప్పుకున్నారు. దీంతో మందారపు సారయ్య, మాందారపు రాములు, భీముని భిక్షపతి, ఏమేని ఐలయ్యలను అరెస్ట్ చేసి వన్య ప్రాణులు చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసి భూపాలపల్లి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

హైటెక్ హంగులు


హైటెక్ హంగులతో కాజీపేట జంక్షన్ నమూనా


అప్పర్‌క్లాస్ వెయిటింగ్‌హాల్ నమూనా

కాజీపేట జంక్షన్‌కు 'అమృత్ భారత్' నిధులు
- జంక్షన్‌కు అత్యాధునిక అందాలతో ఆధునీకరణ
- 120 ఏళ్ల చరిత్ర గల కాజీపేట స్టేషన్
- వరల్డ్ క్లాస్ రైల్వే స్టేషన్‌గా రీమోడలింగ్
- స్టేషన్ ఎదుట రైల్ కోచ్ రెస్టారెంట్
- ప్లాట్‌ఫాంల విస్తరణ.. మరో రెండు అదనపు ప్లాట్‌ఫాంలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌ను అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్రం నిధులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైటెక్ హంగులతో అత్యాధునీకరిస్తున్నారు. 1904లో నిర్మించిన నాటి కాజీపేట రైల్వే స్టేషన్ దినదినాభివృద్ధి చెంది నేడు ఉత్తర, దక్షిణ దేశ ప్రాంతాలకు గేట్ వేగా ఉంటుంది.


ప్రస్తుత కాజీపేట జంక్షన్‌లోని ప్లాట్‌ఫాంలు

120 ఏళ్ల చరిత్ర గల అతిపురాతన కాజీపేట రైల్వే స్టేషన్ రైల్వేపరంగా కాజీపేట నుంచి ఢిల్లీ వరకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న కాజీపేట జంక్షన్‌ను వరల్డ్‌క్లాస్ రైల్వే స్టేషన్‌గా అత్యాధునీకరించేందుకు కేంద్రం అమృత్‌భారత్ నిధులతో శ్రీకారం చుట్టింది. గ్రానైట్‌రాయితో నిర్మాణాలు, కొత్త కొత్త డిజైన్‌లతో రైల్వే కట్టడాలు, ఎంతో అందాన్నిచ్చే పేయింటింగ్స్, గ్రీనరీ గార్డెన్స్ ఏర్పాటుతో కాజీపేట జంక్షన్ న్యూ లుక్‌తో ప్రయాణికులు కొద్ది నెలల్లో చూడబోతున్నారు.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

అమృత్‌భారత్ నిర్మాణ పనుల్లో భాగంగా రైల్వే స్టేషన్ ఎంట్రెన్స్‌లో పోర్టికో, ప్రయాణికులకు అప్పర్‌క్లాస్ వెయిటింగ్ హాల్ నిర్మాణం, ప్లాట్‌ఫాంల విస్తరణ, న్యూ టాయిలెట్స్ బ్లాక్, రైల్వే అధికారుల కార్యాలయాలు, గ్రీన్ గార్డెన్, వాహనాల రోడ్స్, పాత్‌వే, పార్కింగ్, సర్క్యులేషన్ ఏరియా స్మూత్ ట్రాఫిక్ ఫ్లో, రెండు లిఫ్టులు, 3 ఎస్కెలేటర్లు, ప్యాసింజర్ ఫ్రెండ్లీ సైన్ బోర్డులు, నూతన నిర్మాణాలు, రైలు కోచ్‌తో రెస్టారెంట్ హోటల్, కమర్షియల్ డెవలప్‌మెంట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే కాజీపేట జంక్షన్‌లో 100 ఏళ్ల కాలం నాటి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించి అదే స్థలంలో నూతనంగా మోడల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫాంల ఆధునీకరణ పనులు, రైల్వే స్టేషన్ వరకు పూర్తి స్థాయిలో కవర్ షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జంక్షన్ నుంచి కాజీపేట చౌరస్తా వరకు అభివృద్ధి నిర్మాణ పనులు అబ్బురపరిచే విధంగా చేపడుతున్నారు. కాజీపేట చౌరస్తా నుంచి ప్రయాణికులు రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లే ఎంట్రెన్స్, రైల్వే స్టేషన్ వరకు ఎటు చూసిన ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రానికి వచ్చినట్లుగా అన్ని హంగులతో నిర్మిస్తున్నారు. అన్ని విధాల రినోవేషన్ పనులు పూర్తి చేసి కాజీపేట జంక్షన్‌ను వచ్చే నెల (జనవరి)లో ప్రారంభించేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొత్తం 5 ప్లాట్‌ఫాంలు..


జంక్షన్‌లో నిర్మాణ దశలో మోడల్ ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి

ఉత్తర తెలంగాణలో అతిప్రధానమైన కాజీపేట జంక్షన్ రైల్వే ప్లాట్‌ఫాంల విస్తరణకు రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ప్లాట్‌ఫాంల విస్తరణ పనులను దక్షిణ మధ్య రైల్వే అధికారులు త్వరలో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట జంక్షన్ నుంచి ప్రతీ రోజు వివిధ ప్రాంతాలకు సుమారు 20 వేల మంది ప్రయాణికులు రాకపోకలు చేస్తున్నారు. న్యూఢిల్లీ, చెన్నై, హైదరాబాద్ నుంచి వచ్చి వెళ్లే అప్ అండ్ డౌన్ రైళ్లకు ముఖ్య కూడలిగా కాజీపేట జంక్షన్ ఉంది. వివిధ రూట్‌ల నుంచి కాజీపేట జంక్షన్‌కు వచ్చి వెళ్లే ప్రయాణికుల రైళ్లతో పాటు గూడ్స్ రైళ్ల రవాణా ట్రాఫిక్‌తో రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 1, 2, 3వ నంబర్ ప్లాట్‌ఫాంలు బిజీ బిజీగా మారి సరిపోవడం లేదు. రైళ్ల రద్దీతో రైళ్లను అవుటర్ సిగ్నల్స్ వద్ద నిలిపేయాల్సి వస్తుంది. నిర్ణీత సమయానికి రావాల్సిన రైళ్లు ఆలస్యం కావడంతో పాటు ప్రయాణికుల సమయం వృథా అవుతుంది. దీంతో అదనపు ప్లాట్‌ఫాంల విస్తరణకు ప్రతిపాదనలు పంపిన అధికారులు మరో రెండు (4, 5వ నంబర్) ప్లాట్‌ఫాంలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. కాజీపేట జంక్షన్ నుంచి ప్రయాణించే రైళ్లతో పాటు కాజీపేట మీదుగా వివిధ మార్గాలకు ప్రయాణించే పలు రైళ్లకు ట్రాఫిక్ సమస్య ఉండదని రైల్వే అధికారులు అంటున్నారు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో బంగారు పతకం


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న జ్యోతి

పలిమెల : కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో భారత జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ జట్టులో జేఎస్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలానికి చెందిన కావేరి జ్యోతి పాల్గొని దేశం తరపున ఆడి బంగారు పతకం సాధించడంతో స్థానికుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చేపల చెరువు పరిశీలన


చేపల చెరువును పరిశీలిస్తున్న రాజన్న

మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట పరిసరాల్లో పోర్ట్‌రోడ్డు ప్రాంతానికి చెందిన సిద్ధం రాము ఏర్పాటు చేసిన చేపల చెరువును శుక్రవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ గణేష్‌తో కలిసి కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న పరిశీలించారు. శీతాకాలంలో కొర్ర మీను చేపలకు తీసుకోవాల్సిన మేత యాజమాన్య పద్ధతులను వివరించారు. చెరువు నీటి ఉష్ణోగ్రత తగ్గడంతో చేపల్లో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని సూక్ష్మ పోషకాలైన విటమిన్లు, ఖనిజ లవణాల మిశ్రమాన్ని చేపల దానాతో పాటు కలిపి వినియోగించాలని మత్స్యకారులకు సూచించారు. అనంతరం రైతు సిద్ధం రాముకు చేప ఎదుగుదలకు గ్రోత్ ప్రమోటర్ మందును శాస్త్రవేత్తలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, రైతులు పాల్గొన్నారు

సీపీఎస్ అమలుకు నిరవధిక నిరాహార దీక్ష

- ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న పూల రవీందర్

జనగామ రూరల్: సీపీఎస్ సాధనకు నిరవధిక నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. శుక్రవారం జనగామ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌పీలకు కనీస వేతన చట్టం వర్తింపజేయాలన్నారు. కార్పొరేట్ వైద్యసేవలతో కూడిన హెల్త్‌కార్డులు అందించాలన్నారు. గిరిజన సంక్షేమశాఖలో పండిట్, పీఈటీ పోస్టులను అప్‌డేషన్ చేయాలన్నారు. గురుకుల పాఠశాలల పని వేళలను ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం అయ్యేటట్లు ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాక్టో చైర్మన్ సదానందం గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్న పూల రవీందర్‌ను మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో చాప్టర్ జనరల్ సెక్రటరీ కె. కృష్ణుడు, ఎండీ అబ్దుల్లా, హేమచంద్రుడు దానయ్య, రాధాకృష్ణ, సచ్చిదానందరెడ్డి, నగేష్ యాదవ్, బీసీటీఏ జనగాం జిల్లా ప్రెసిడెంట్ ఎలికట్ట యాదగిరి, జనరల్ సెక్రటరీ మామిండ్ల అంజయ్య, ఉపాధ్యక్షుడు మండల సుభాష్, నీలం వేణు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న కేంద్రం

- సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య



సమావేశంలో మాట్లాడుతున్న దీపాంకర్ భట్టాచార్య

వరంగల్: రాజ్యాంగ స్ఫూర్తికి బీజేపీ ప్రభుత్వం విఘాతం కలిగిస్తోందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. శుక్రవారం ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో జరిగిన సమావేశంలో వరంగల్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి అధ్యక్షత వహించగా తొలుత అమరవీరులకు నివాళులర్పించారు. ఆజం జాహి మిల్లు గ్రౌండ్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కాశిబుగ్గ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అణగారిన వర్గాల అభ్యున్నతికి, మానవ హక్కుల కోసం పోరాడి స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం అనే విలువలు కాపాడేందుకు రాజ్యాంగంలో పొందుపరిచిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యుడు ఎన్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, రొయ్యల రాజు, శ్రీనివాస్, గుమ్మడి రాజుల సాంబయ్య, గోల్కొండ కుమార్, మారేపల్లి మల్లేష్, రజిత, ఖాజా మొహినుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలుబోగిలో పొగలు



గూడ్స్ రైలుబోగి నుంచి వెలువడుతున్న పొగ

స్టేషన్‌ఘన్‌పూర్: రామగుండం నుంచి సికింద్రాబాద్ వైపు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలుబోగి నుంచి పొగలు వచ్చిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బొగ్గు లోడ్‌తో వైటీపీ 4 అనే గూడ్స్ రైలు రామగుండం నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తుంది. ఈ క్రమంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో రైలు స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకోగా ఓ బోగి నుంచి పొగలు వస్తున్న విషయాన్ని రైల్వే సిబ్బంది గమనించి స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం అందించగా రైలును ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో నిలిపి ఫైరింజన్‌కు సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్ జమీందార్ లింగయ్య, ఫైర్‌మన్ గణేష్ ఫైరింజన్‌తో రైల్వే ఒకటవ ప్లాట్‌ఫారంపైకి వచ్చారు. అయితే రైలు రైల్వేవిద్యుత్ మెయిన్‌లైన్‌లో ఉండటంతో విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు సంబంధిత కంట్రోలర్‌కు స్టేషన్‌మాస్టర్ సమాచారం అందించారు. విద్యుత్ సరఫరా నిలిపేసిన అనంతరం ఫైర్ ఇంజన్ సిబ్బంది రైలు బోగిలో నీటిని కొట్టగా పొగలు తగ్గిపోయాయి. అయితే బొగ్గు లోడ్ కావడంతో వేడితో బొగ్గు అంటుకుని పొగలు వ్యాపించి ఉంటాయని రైల్వే సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. సకాలంలో సిబ్బంది గమనించి మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పిందని రైల్వే అధికారులు తెలిపారు.

ముగిసిన రైల్వే ఎన్నికలు

- 12న ఫలితాలు


పోలింగ్ శిబిరం వద్ద మురళీకృష్ణ, నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ప్రతిష్టాత్మకంగా రైల్వే గుర్తింపు సంఘం కోసం రెండు రోజుల పాటు జరిగిన రైల్వే వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికలు శుక్రవారం ముగిశాయి. ముగింపులో రైల్వే రన్నింగ్‌స్టాఫ్ నుంచి లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి ట్రెన్ మేనేజర్లు (గార్డులు) పోలింగ్ సెంటర్లకు వచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు. రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ కొత్త మురళీకృష్ణ పోలింగ్ శిబిరాలను సందర్శించి సంఘ నాయకులను కలిసి ఓటింగ్ సరళిని తెలుసుకున్నట్లు రైల్వే సంఘ్ నాయకులు తెలిపారు. రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కాజీపేట లోకో రన్నింగ్ బ్రాంచీ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ మాట్లాడుతూ కాజీపేటలో లోకోపైలెట్లు, ట్రెన్ మేనేజర్లు కలిపి 848 మంది ఓటర్లు ఉండగా 780 ఓట్లు పోలైనట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్‌లో మొత్తం 3,474 ఓటర్లు ఉండగా మూడు రోజుల ఎన్నికలో 3,148 ఓట్లు పోలైనట్లు (91 శాతం) తెలిపారు. రైల్వేలో గుర్తింపు సంఘం కోసం జరుగుతున్న ఎన్నికల ఫలితాలను ఈ నెల 12వ తేదీన ప్రకటించనున్నారు.

పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతల స్వీకరణ


రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పరీక్షల విభాగం అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. అమరవేణి, ప్రొఫెసర్ నర్సింహాచారి, అధ్యాపకులు డాక్టర్ ఫణీంద్ర, పరిశోధక విద్యార్థులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అలాగే పరీక్షల విభాగంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ సౌజన్య, నాగరాజులు రాజేందర్, మాజీ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారిని సన్మానించి అభినందనలు తెలిపారు.

రిజిస్ట్రార్‌ను అడ్డుకున్న విద్యార్థిసంఘాలు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించడంలో యూనివర్సిటీ అధికారులు ఆలస్యం చేశారని మండి పడుతూ వివిధ విద్యార్థిసంఘాల నాయకులు రిజిస్ట్రార్ మల్లారెడ్డిని అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి... శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి ఉదయం 11.45 గంటలకు దూరవిద్యాకేంద్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు రాగా పలు విద్యార్థి సంఘాల బాధ్యులు అడ్డుకొని ఉదయమే కార్యక్రమానికి రావాల్సి ఉండగా ఇంత ఆలస్యంగా ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తూ పూలమాల వేయకుండా అడ్డుకున్నారు. యూనివర్సిటీ అధికారుల తీరుపై మండిపడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించాల్సి ఉండేదని, డైరెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అంబేడ్కర్ వర్ధంతి ఉందని తెలుసుకొని కార్యక్రమ నిర్వహణకు వచ్చానని రిజిస్ట్రార్ తెలిపారు. అలాగే దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. రాంచంద్రంకు కూడా సమాచారం ఇచ్చామన్నారు. విద్యార్థిసంఘాల బాధ్యులకు సర్దిచెప్పిన తర్వాత రిజిస్ట్రార్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి..

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. బాబా సాహెబ్ వర్ధంతి సందర్భంగా దూరవిద్యాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య రాంచంద్రం, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బిక్షాలు, కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఆచార్య గాదె సమ్మయ్య, రిటైర్డ్ ఆచార్యులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి


శివకుమార్ (ఫైల్)

కాటారం: వివాహ శుభ కార్యానికి ఫొటోలు తీయడానికి వెళ్తూ ఓ యువ వీడియోగ్రాఫర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మాబాద్‌కు చెందిన ఆడెపు శివకుమార్ (21) అనే యువకుడు వీడియోగ్రాఫర్ వృత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. శుక్రవారం భూపాలపల్లిలో జరిగే ఓ వివాహ శుభకార్యానికి ఫొటోలు, వీడియో తీయడానికి శ్రీసోని ఫొటో స్టూడియో యజమాని గంధం వీరస్వామితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కాటారం మండల కేంద్రానికి సమీపంలోకి చేరుకోగానే ద్విచక్ర వాహనం ముందు వెళ్తున్న టిప్పర్ అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో బైక్ వెనకనుంచి ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న వీరస్వామి, వెనకాల కూర్చున్న శివకుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శివకుమార్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు రోహిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి జారి పడి వ్యక్తి..


కేశగాని వీరయ్య (ఫైల్)

తొర్రూరు రూరల్: తాటి చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారిమడూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కేశగాని వీరయ్య (57) గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. రోజువారీలాగే గ్రామ శివారులో కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. చెట్టు పైభాగం వరకు వెళ్లిన క్రమంలో మోకు జారి కిందపడ్డాడు. దీంతో తల, ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కిందపడిన కొన్ని గంటల తర్వాత స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు మహేష్, సోమన్న, భార్య కనకతార ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

నెల్లికుదురు: ఓ వివాహిత బిడ్డతో సహా అదృశ్యమైన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలకేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం .. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జాలోన్ జిల్లా సిరిసా మండలం అభేదిపూర్ గ్రామానికి చెందిన గోవింద్ సింగ్, రాఖీదేవి దంపతులు జీవనోపాధి కోసం నెల్లికుదురు మండలకేంద్రంలో నివాసం ఉంటున్నారు. మూడేళ్లుగా పానీ పూరి బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి 15 నెలల బాబు ఉన్నాడు. ఈ నెల 5న తన కుమారుడు, భార్య రాఖీదేవి అదృశ్యమయ్యారని, చుట్టు పక్కల వెతికినా కనిపించడం లేదని భర్త గోవింద్‌సింగ్ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీరు సీసాలో చెత్త!

- వైన్‌షాపు ఎదుట ఆందోళన


బీరుసీసా అడుగు భాగంలో వచ్చిన చెత్త

కేసముద్రం: బీరు సీసాలో చెత్తాచెదారం వచ్చిన సంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండల కేంద్రంలోని లక్ష్మీ వైన్ షాపులో కొందరు వ్యక్తులు కలిసి బీర్లు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఆ బీర్లను తాగే క్రమంలో ఓ బీరుసీసా అడుగు భాగంలో చెత్త (వ్యర్థపదార్థం) కనిపించింది. దీంతో ఆగ్రహానికి గురైన సదరు వ్యక్తులు వైన్‌షాపు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై మురళీధర్‌రాజు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. కంపెనీ నుంచి వచ్చిన బీరుసీసాలనే తాము విక్రయిస్తున్నామంటూ షాపు నిర్వాహకులు చెప్పుకొచ్చారు.